సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 24 । జూన్ । 2025



జూరాలకు ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

వివరాలు 8లో ▸



చిన్నచూపు చూడొద్దు

వితంతువులను చిన్నచూపు చూడొద్దని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.8 /22.1

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలకు రక్షణ కరువు



బిజినేపల్లి: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళల మాన ప్రాణాలకు రక్షణ కరువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. సోమవారం బిజినేపల్లిలో నిర్వహించిన 18వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని అన్నారు. దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపద కొల్లగొట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతమార్చడం దారుణమన్నారు. చెంచు గిరిజనులను కూడా అటవీ ప్రాంతంలో లేకుండా చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.కోట్ల విలువచేసే ఖనిజ సంపదను ఆదానీ, అంబానీలకు నిసిగ్గుగా కట్టబెడుతుందని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని.. వీటిని ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతుభరోసా వంటి ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలో ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి వాటిని సీపీఐ సాధించిందని గుర్తుచేశారు. అంతకుముందు ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి.. సభా ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, ఈర్ల చంద్రమౌళి, టి.నర్సింహ, మారేడు శివశంకర్, కృష్ణాజీ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 51ని సవరించాలి



బిజినేపల్లి: గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసేందుకు జీఓ 51ని సవరించాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని కారుకొండ తండా పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్థానం కల్పించి.. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సాయి, మశన్న, శివశంకర్, కృష్ణయ్య, కొండయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తి డీఎస్పీగా వెంకట్‌రెడ్డి



కల్వకుర్తిటౌన్: కల్వకుర్తి డీఎస్పీగా వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయగా.. డీజీపీ కార్యాలయంలో పోస్టింగ్ కోసం వెయిటింగ్ చేస్తున్న వెంకట్‌రెడ్డిని కల్వకుర్తి డీఎస్పీగా నియమించారు. డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డికి డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

26న అప్రెంటిస్‌షిప్ మేళా

కందనూలు: మహబూబ్‌నగర్ ఒకేషనల్ కళాశాలలో ఈ నెల 26న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 తర్వాత ఐటీఐ పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో అప్రెంటిస్‌షిప్ మేళాకు హాజరు కావాలని సూచించారు.

నేడు మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలు

కందనూలు: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల నిమిత్తం మంగళవారం మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ సీతారాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే మండలస్థాయి ఎంపికలకు 8–9 ఏళ్ల వయసు ఉన్న బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ, జననం, కుల ధ్రువ పత్రాలు, ఐదు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

స్థానిక పోరుకు కసరత్తు



ఎన్నికల నిర్వహణకు అధికారుల సన్నద్ధం

- ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తి
- బీసీ రిజర్వేషన్లపైనే ఉత్కంఠ
- ప్రధాన పార్టీల సమావేశాలతో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యారు. ఈ ఏడాది జనవరి 2న ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. అలాగే పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్‌ను సైతం రూపొందించి అధికారులు ప్రభుత్వానికి పంపించారు. దీంతో ఎన్నికల నిర్వహణకు సర్వం సన్నద్ధం కావడంతో స్థానిక పోరు నోటిఫికేషన్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

– సాక్షి, నాగర్‌కర్నూల్

సర్వం సన్నద్ధం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం కసరత్తును పూర్తిచేసింది. ఎన్నికల సంఘం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ఎన్నికల నిర్వహించేందుకు వీలుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మ్యాపింగ్‌ను అధికారులు పూర్తి చేశారు. బ్యాలెట్ బాక్సులతో పాటు బ్యాలెట్ పేపర్లను ముద్రణకు అనుగుణంగా సిద్ధంగా ఉంచారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని గుర్తించడంతో పాటు ఇప్పటికే ఆర్వో, ఏఆర్వో, పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్‌లను ఆయా మండలాలకు తరలించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే కార్యాచరణ కొనసాగించేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల సంఖ్య

జిల్లా	జెడ్పీటీసీలు	ఎంపీటీసీలు
మహబూబ్‌నగర్	14	175
నాగర్‌కర్నూల్	20	214
వనపర్తి	14	128
జోగుళాంబ గద్వాల	13	142
నారాయణపేట	11	142

గత ఎన్నికల్లో జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆయా పార్టీలు గెలుపొందిన స్థానాలు

జిల్లా	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
మహబూబ్‌నగర్	14	-	-
నాగర్‌కర్నూల్	17	3	-
వనపర్తి	13	1	-
జోగుళాంబ గద్వాల	13	-	-
నారాయణపేట	9	1	1

రిజర్వేషన్లపైనే ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశమే కీలకంగా మారింది. ఈ విషయంపై కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుండగా.. చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో చేసిన చట్టం ప్రకారం రిజర్వేషన్లను మరోసారి కొనసాగించే వీలుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెబుతోంది. బీసీ రిజర్వేషన్లపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఆమోదం తెలిపి పార్లమెంట్‌కు పంపింది. పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని అమలు చేస్తే బీసీ రిజర్వేషన్లు పెరిగి బీసీ వర్గాలకు సీట్లు పెరిగే అవకాశం ఉంది. మరో వారం రోజుల్లోనే ఈ రిజర్వేషన్ల అంశంపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

గత ఎన్నికల్లో ఎంపీటీసీ స్థానాల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన సీట్లు

జిల్లా	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇండిపెండెంట్
మహబూబ్‌నగర్	111	42	6	16
నాగర్‌కర్నూల్	137	52	4	16
వనపర్తి	89	20	-	19
జోగుళాంబ గద్వాల	98	27	9	7
నారాయణపేట	88	26	23	5

మూడు ప్రధాన పార్టీల కన్ను..

గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ప్రధాన పార్టీలు కీలకంగా భావిస్తున్నాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తోంది. పార్టీ నాయకులు, కేడర్‌లో ఉత్సాహాన్ని నింపుతోంది. కాంగ్రెస్ హామీ ఇస్తున్నట్టుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరాలని, లేకపోతే ఈ అంశాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది. బీజేపీ సైతం ఇప్పటికే రాష్ట్రస్థాయిలో సమావేశాలను నిర్వహించగా, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ నాగర్‌కర్నూల్‌లో మూడు, నారాయణపేటలో ఒక్క జెడ్పీటీసీ స్థానాన్ని సంపాదించింది. బీజేపీకి నారాయణపేట జిల్లాలోనే ఒక్క జెడ్పీటీసీ స్థానం దక్కింది. ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రధాన పార్టీలు తమ బలాబలాలను అంచనా వేసుకుంటున్నాయి. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నాయి.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



చంద్రాయన్‌పల్లిలో బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

చారకొండ/వెల్దండ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం చారకొండ మండలం చంద్రాయన్‌పల్లిలో రూ. 4.48కోట్లతో బీటీరోడ్డు నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదే విధంగా వెల్దండ మండలంలో రూ. 4.48కోట్లతో భైరాపూర్–అజిలాపూర్ బీటీరోడ్డు నిర్మాణానికి, కుప్పగండ్ల–పెద్దాపూర్ మార్గంలో రూ. 2.50కోట్లతో వంతెన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మాజీ సర్పంచులు వసంత, భూపతిరెడ్డి, నాయకులు సాంబయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, మోతీలాల్ నాయక్, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కృష్ణ, ఎర్ర శ్రీను, హరికిషన్, నారాయణ, రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కులను కాపాడుకుందాం



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కందనూలు: పెన్షనర్ల హక్కులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్ల పాలిట ఆశనిపాతంగా మారిన ఫైనాన్స్ బిల్లు–2025ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఏ పెన్షన్ రూల్స్‌కు సంబంధం లేకుండా ప్రభుత్వ పెన్షనర్లను వేర్వేరు గ్రూపులుగా విభజించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. వేతన సవరణ సంఘం సిఫారసులను పాత పెన్షనర్లకు కాకుండా.. కొత్తగా రిటైర్డ్ అయిన వారికి మాత్రమే వర్తించే విధంగా చేయడం సరికాదని అన్నారు. పెన్షనర్ల హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటశెట్టి, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు చెన్నయ్య, మండలశాఖ అధ్యక్షుడు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సీఎం ముఖాముఖి

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా వానాకాలం పంట పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో విజయవంతంగా జమ చేసిన సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారని కలెక్టర్ బదావత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి రైతు వేదిక వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలస్థాయి అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు. రైతువేదికల వద్దకు ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో చేరుకొని ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న టి.సాగర్

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు నకిలీ విత్తనాలతో మోసపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. వానాకాలంలో పంటల సాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదని.. నామమాత్రంగా రుణమాఫీ పథకం వర్తింపజేసి చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. రైతుభరోసా ఇవ్వడంలోనూ విఫలమైందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, నాయకులు ఆర్.శ్రీనివాసులు, ఆంజనేయులు, గీత, దశ్యానాయక్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: వివిధ సమస్యలపై ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి వస్తారని.. అధికారులు శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. కాగా, ప్రజావాణికి 72 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండారెడ్డిపల్లి గ్రామ పరిధిలో రూ. 21కోట్లతో చేపట్టిన నాలుగు లైన్ల రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 3కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం, రూ. 2.85కోట్లతో చేపట్టిన విద్యుత్ ఆధునీకీకరణ పనుల్లో పురోగతి ఉండాలన్నారు. గ్రామంలో 515 ఇళ్లకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదించగా.. ఇప్పటివరకు 407 ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్డీఓ చిన్న ఓబులేషు, పీఆర్ ఈఈ విజయ్ ఉన్నారు.

స్థిరమైన జీవన విధానాలపై అవగాహన అవసరం..

విద్యార్థి దశలోనే స్థిరమైన జీవన విధానాలపై అవగాహన ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో జాతీయ విద్యార్థి పర్యావరణ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, డీఈఓ రమేశ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ, విద్యా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో 1నుంచి 12వ తరగతి విద్యార్థులకు 'హరిత్– జీవన మార్గం' నినాదంతో జాతీయ విద్యార్థి పర్యావరణ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ పోటీలు రూపొందించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో స్థిరమైన జీవన విధానాలపై ఆసక్తి పెంచడం.. పర్యావరణ సమస్యలపై చర్చను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 1నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు 63025– 38858 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 14 అర్జీలు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 14 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. అందులో 7 భూతగాదా, 7 తగున్యాయం కోసం ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు.

దివ్యాంగులపై చులకనభావం వద్దు



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ శ్రీరాం ఆర్య

నాగర్‌కర్నూల్ క్రైం: దివ్యాంగులపై వేధింపులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ శ్రీరాం ఆర్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు తమ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు తోడ్పాటు అందించాలని సూచించారు. వైకల్యం కారణంగా చిన్నచూపు చూడరాదని.. వ్యక్తిగత స్వేచ్ఛ హరించరాదన్నారు. వైకల్యం గల వ్యక్తులను హింసించడం, అనుమతి లేకుండా పరిశోధనలు చేయడం, ఆహారం ఇవ్వకపోవడం, లైంగికంగా వేధించడం వంటి చర్యలకు పాల్పడితే ఐదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ. 50వేల నుంచి రూ. 5లక్షల వరకు జరిమానా విధించబడుతుందని అన్నారు. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యుల నుంచి దివ్యాంగులను అకారణంగా విడదీయరాదన్నారు. దివ్యాంగులు టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని హాజీపూర్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, రైతుభరోసా, రైతు రుణమాఫీ వంటి పథకాలను అందిస్తున్నామన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో పాటుపడుతోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం..

చారకొండ: మండలంలోని సిర్సనగండ్లలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. నిర్వాసిత కుటుంబాలు అచ్చంపేటలో ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఇళ్లు, స్థలాలు ఇస్తామని నిర్వాసితులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, గోరటి శివ, మాజీ సర్పంచ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 18 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ సోమవారం సాయంత్రం వరకు నీటిమట్టం 18 అడుగులకు చేరింది. జూరాల నుంచి నీరు రాక ముందు 11 అడుగులుగా ఉన్న నీటిమట్టం 7 అడుగులు పెరిగి 18 అడుగులకు చేరింది. పాత అలుగు స్థాయి 26.6 అడుగులు ఉండగా మరో 8.6 అడుగులు వస్తే పాత అలుగు స్థాయికి నీటిమట్టం చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి గేట్ల లెవల్ వరకు 32.6 అడుగులు కాగా.. మరో 14.6 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు పూర్తిగా నిండుతుంది.

క్లుప్తంగా

భర్త మందలించాడని తెల్లారే సరికి అదృశ్యం


రేణుక(ఫైల్)

గోపాల్‌పేట: భర్త మందలించాడని మరుసటి రోజు తెల్లారేసరికి భార్య అదృశ్యమైన ఘటన రేవల్లి మండలంలోని తల్పునూరులో చోటుచేసుకుంది. మండలంలోని తల్పునూరుకు చెందిన ఉప్పరి రేణుక, దస్తగిరి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుని గ్రామంలోనే బతుకుతున్నారు. ఈనెల 14న సాయంత్రం 6గంటల ప్రాంతంలో రేణుక ఫోన్ మాట్లాడుతుండగా.. ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని భర్త మందలించాడు. ఆ తర్వాత ఎప్పటిలాగే ఇంట్లో అందరూ పడుకున్నారు. 15వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో చూస్తే భార్య రేణుక కనిపించలేదు. అప్పటినుంచి గ్రామంలో తెలిసిన వారి ఇళ్లు, బంధువుల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం రేవల్లి పోలీస్‌స్టేషన్‌లో దస్తగిరి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్సై రజినీ వివరించారు.

మోకాళ్ల నొప్పులు.. అనారోగ్య సమస్యలతో..

- ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


బాలీశ్వరయ్య (ఫైల్)

లింగాల: మోకాళ్ల నొప్పులు, అనారోగ్య సమస్యలు భరించుకోలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసున్నది. ఎస్సై వెంకటేశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అల్లె బాలీశ్వరయ్య(58) మండలంలోని అప్పాయపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంటమనిషిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల నుంచి మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండేవాడు. సోమవారం డ్యూటీకి వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. మార్గమధ్యంలో అప్పాయపల్లి శివారులోని పలుగురాళ్ల గుట్ట వద్ద ఉరేసుకొన్నాడు. మృతుడికి భార్య వెంకటమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుమారుడు బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఊర్కొండ: మండలంలోని కల్వకుర్తి–జడ్చర్ల ప్రధాన రహదారిపై జిన్నింగ్ మిల్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి అనంతరెడ్డి(40) మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణదేవ కథనంప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం బొందలపల్లికి చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి ఊర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లిలో జూన్ 15 బంధువుల ఇంట్లో శుభకార్యానికి బైక్‌పై వెళ్లి అక్కడే వదిలేశాడు. ఆదివారం తన చిన్నకుమారుడు శ్యాంసుందర్‌రెడ్డి, పెద్దకుమారుడు అనంతరెడ్డి కలిసి తమ కొత్త వాహనంతో టీవీఎస్ ఎక్సెల్‌ను తాడుతో కట్టుకొని తీసుకొస్తున్నారు. అనంతరెడ్డి బైక్‌పై నుంచి అదుపు తప్పి కిందపడగా తలకు బలమైన గాయమైంది. 108లో కల్వకుర్తి ఆస్పత్రి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి తల్లి కౌసల్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తండ్రి ఆస్తిలో సమాన వాటా ఇవ్వలేదని..

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

అయిజ: తండ్రి ఆస్తిలో సమాన వాటా ఇవ్వలేదని మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన అయిజ మున్సిపాలిటీలోని తుపత్రాలలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని రాయిచూర్ జిల్లా మలిగబాదాకు చెందిన కుర్వ జములమ్మ (26)కు తుపత్రాలకు చెందిన కుర్వ తిరుమలేశ్‌తో వివాహం చేశారు. జములమ్మ తండ్రికి ఇద్దరు భార్యలు. ఒక భార్య కూతురు జములమ్మ ఆస్తిలో తనకు సమాన వాటా కావాలని కోరింది. పెద్దమనుషుల సమక్షంలో రూ.10లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొన్నారు. తర్వాత రూ.4లక్షలు మాత్రమే ఇస్తామని మాటమార్చడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతిచెందింది. ఘటనా స్థలాన్ని సీఐ టాటాబాబు, అయిజ ఎస్సై శ్రీనివాసరావు, మల్దకల్ ఎస్సై నందీకర్ పరిశీలించారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

పదకొండేళ్లు సాఫ్ట్‌గా..!


ఏషియా కప్‌లో పాల్గొన్న భారత జట్టుతో కిరణ్‌కుమార్ (వృత్తంలో)

- అంతర్జాతీయ స్థాయికి రాణిపేట యువకుడు
- సాఫ్ట్‌బాల్‌లో అంచెలంచెలుగా ఎదుగుతూ ఉత్తమ ప్రతిభ
- బ్యాంకాక్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం
- వివిధ విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాల సాధన


బ్యాంకాక్‌లో జరిగిన ఏషియా కప్‌లో బ్యాటర్ చేస్తున్న కిరణ్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్ మండలం రాణిపేటకు చెందిన జక్కా కిరణ్‌కుమార్ సాఫ్ట్‌బాల్ క్రీడలో విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. తండ్రి చిన్న బీరయ్య ఆర్టీసీ ఉద్యోగి, తల్లి రాములమ్మ. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉన్న కిరణ్‌కుమార్ సాఫ్ట్‌బాల్ క్రీడను ఎంచుకొని రాణిస్తున్నాడు. 11ఏళ్ల నుంచి సాఫ్ట్‌బాల్‌లో రాణిస్తూ తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జిల్లా, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు పలుమార్లు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వివిధ విభాగాల్లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణం, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించాడు.

2016లో మొదటి నేషనల్

కిరణ్‌కుమార్ దాదాపు 20సార్లు రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. 2016 సంవత్సరంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దుర్గ్‌లో జరిగిన జాతీయ స్థాయి నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో మొదటిసారిగా పాల్గొన్నాడు. 2017లో హైదరాబాద్, చత్తీస్‌ఘడ్ దుర్గ్, 2018 గుజరాత్‌లో జరిగిన జూనియర్ నేషనల్‌లో ఆడాడు. 2022లో ఏపీలోని అనంతపూర్‌లో జరిగిన జాతీయ సీనియర్, గుంటూర్‌లో జరిగిన సీనియర్ సౌత్‌జోన్ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2023లో జమ్మూకశ్మీర్(జమ్ము)లో జరిగిన సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన ఆలిండియా ఇంటర్ జోనల్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున ఆడగా.. జట్టు ప్రథమ స్థానంలో నిలవడంతో కిరణ్‌కుమార్ బంగారు పతకం సాధించాడు. 2024లో మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరిచి ఉత్తమ బ్యాటర్‌గా ఎంపికయ్యాడు.

బ్యాంకాక్ టోర్నీలో ప్రాతినిధ్యం

థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఈనెల 2వ తేదీనుంచి 5వరకు జరిగిన 2వ అండర్–23 పురుషుల సాఫ్ట్‌బాల్ ఏషియా కప్– 2025లో కిరణ్‌కుమార్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈటోర్నీకి ముందు మహారాష్ట్ర జలాగం, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగిన సెలక్షన్స్ ట్రయల్స్, కోచింగ్ క్యాంపునకు ఎంపికై ఏషియా కప్‌లో పాల్గొనే తుది భారత జట్టుకు ఎంపికయ్యాడు. బ్యాంకాక్‌లో జరిగిన ఏషియా కప్‌లో కిరణ్‌కుమార్ ఐదు మ్యాచులకు హాంకాంగ్–చైనా, సింగపూర్, థాయిలాండ్ జట్లతో భారత జట్టు తరఫున ఆడాడు.

ఒలింపిక్స్‌లో ఆడడమే లక్ష్యం

2027 ఒలింపిక్స్‌లో సాఫ్ట్‌బాల్ క్రీడకు చోటు దక్కింది. ఈ ఒలింపిక్స్‌లో భారత జట్టుకు ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న. అందుకు రెగ్యులర్‌గా సాధన చేస్తున్న. బ్యాంకాక్‌లో జరిగిన ఏషియా కప్‌లో దేశం తరఫున ఆడినందుకు సంతోషంగా, గర్వంగా ఉంది. భవిష్యత్‌లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది.
– కిరణ్‌కుమార్, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

వితంతువులను చిన్నచూపు చూడొద్దు

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద
- వితంతు మహిళా సంరక్షణ హక్కులపై అవగాహన
- పాల్గొన్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ రఘునాథ్, అధికారులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద

నాగర్‌కర్నూల్: వితంతువులను చిన్నచూపు చూడకుండా ప్రతిఒక్కరిలోనూ మార్పు రావాలని, తమ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వితంతు మహిళలపై గౌరవంగా ప్రవర్తించేలా జిల్లా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద అన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేతృత్వంలో రాష్ట్ర మహిళా కమిషన్ బృందం సోమవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అన్నిశాఖల జిల్లా అధికారులతో వితంతు మహిళా సంరక్షణ హక్కులపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ప్రథమంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటిసారిగా వితంతు మహిళా సంరక్షణ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోనే వితంతు మహిళలు ఉన్నారని.. అందుకే వారి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో వితంతువుల దినోత్సవాన్ని నిర్వహించాలని ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. భర్తను కోల్పోయాక జీవితంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొనే ఒంటరి మహిళల అభ్యున్నతికి పాటుపడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అధికారులకు సూచించారు. వితంతు మహిళల ప్రాథమిక హక్కులు, అవసరాలు పొందేందుకు పోరాటం చేస్తుంటారని, అలాంటి వారి బాధలు, అనుభవాలపై దృష్టిసారించడంతోపాటు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, కల్పిస్తున్న సంక్షేమ పథకాల అమలు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

వితంతువులు, వారిపై ఆధారపడినవారు ఎదుర్కొంటున్న సవాళ్లు, తరచుగా పేదరికం, సామాజిక వెలివేత, హింస, వివక్షకు గురికాకుండా గుర్తించి కృషిచేయాలని సూచించారు. వితంతువులు కుటుంబాలను పోషించడానికి, కష్టపడుతున్నారని వారికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం అండదండగా నిలుస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో వితంతు మహిళలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ 5శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈ సమావేశం నుంచే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. సమాజంలో వితంతు మహిళలు విద్య, ఆరోగ్య, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

■ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. జిల్లాలో వితంతు మహిళల సామాజిక సంరక్షణ బాధ్యతలను పోలీస్ శాఖ సమర్థవంతంగా నిర్వర్తిస్తుందని తెలిపారు. మహిళలపై అగౌరవంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షీ టీం ద్వారా ఇప్పటికే అనేక రకాల సమస్యలను పరిష్కరించామని, మహిళలు తమ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పీ రామేశ్వర్, మహిళా కమిషన్ కార్యదర్శి పద్మజస్వరూప, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి, డీఆర్డీఏ చిన్నఓబులేశ్, ఎస్సీ కార్పొరేషన్ రామ్‌లాల్, సఖి కోఆర్డినేటర్ సునీత, మహిళలు, వితంతువులు పాల్గొన్నారు.

కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మహిళల అభ్యున్నతికి అమలు చేయనున్న పథకాలతో పారిశ్రామిక వేత్తలుగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 13, 696 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, అందులో 1,47,123 మంది మహిళలు సభ్యులుగా నమోదై ఉన్నారని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 43, 703 మంది వితంతు మహిళాలకు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా చేపట్టిన స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాల్లో 10శాతం వితంతువులు ఉండేలా చూడాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.

నకిలీ విత్తనాలు విక్రయించిన ఇద్దరి రిమాండ్


ఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: నకిలీ విత్తనాలు విక్రయించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఆవంచలో గతనెల 30న నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తుల ఘటనపై ఎస్పీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మే 30న తిమ్మాజిపేట మండలం ఆవంచలో కనిక వెంకటయ్య ఇంట్లో 10కిలోల నకిలీ పత్తి విత్తనాలు పోలీసుల సోదాల్లో లభించడంతో అతడిపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా విచారించగా.. వెంకటయ్య అదే గ్రామంలోని పస్పరి వెంకటయ్య నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఇదే క్రమంలో జడ్చర్లలోని ఫర్టిలైజర్ దుకాణం నిర్వహించే వెంకట్ నారాయణగౌడ్ వద్ద కొనుగోలు చేసినట్లు గుర్తించగా.. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. వెంకట్ నారాయణగౌడ్‌కు నకిలీ పత్తివిత్తనాలను గుజరాత్ రాష్ట్రానికి చెందిన సత్యకుమార్ నుంచి బ్లూడార్ట్ కోరియర్ ద్వారా తెప్పించుకుని రైతులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు సత్యకుమార్‌ను గుజరాత్ నుంచి జడ్చర్లకు రప్పించి అదుపులోకి తీసుకుని విచారించగా'' ఫ్రీడమ్ '' ప్రీమియమ్ హైబ్రిడ్ కాటన్ బ్రాండ్ పేరుతో మాక్సిజెని సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరుతో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. నిందితులు వెంకట్‌నారాయణగౌడ్, సత్యకుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కనకయ్యగౌడ్ ఉన్నారు.

చేతకాని హామీలతో కాంగ్రెస్ మోసం

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- మాచన్‌పల్లిలో వికసిత్ భారత్ సంకల్పసభ


మాచన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతగాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందని ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం మండలంలోని మాచన్‌పల్లిలో ప్రధానిగా నరేంద్ర మోదీ 11 ఏళ్ల విజయోత్సవాల్లో భాగంగా వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. సభకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై బలిదాన్ దివస్‌లో భాగంగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వికసిత్ సంకల్పానికి మేము సహకరిస్తామంటూ సభలో పార్టీ కార్యకర్తలతో నల్గొండ ఎంపీ కంటెస్టెడ్ క్యాండిడేట్ జితేందర్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంపీ మాట్లాడారు. పాలమూరు వాస్తవాలను ప్రజలకు చెప్పి ఎన్నికల్లో ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేకున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కేంద్రం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కుటుంబంలోని ప్రతి మహిళకు రూ.2500, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పాలమూరు ఎంపీగా పేదలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, జయశ్రీ, అంజయ్య, మీడియా సెల్ కన్వీనర్ సతీశ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు గంగన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్తూ.. బొలెరో బోల్తా


దోమలపెంట: శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్తూ.. అమ్రాబాద్ మండలంలోని దోమలపెంట అటవీ చెక్‌పోస్ట్‌కు మూడు కిలోమీటర్ల దూరంలోని మలుపు వద్ద సోమవారం బొలెరో అదుపుతప్పి కింద పడిన ఘటన చోటుచేసుకున్నది. సమాచారం అందుకున్న ఈగలపెంట పోలీసులు నరేశ్, ఛత్రూ, పరమేశ్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పోలీసుల కథనం ప్రకారం.. గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం, నందిన్నేకు చెందిన 25మంది బొలెరోలో శ్రీశైలం దర్శనానికి వస్తుండగా.. ప్రమాదవశాత్తు రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్, జయమ్మ, ముత్తమ్మ, రాజు గాయపడగా.. రాములమ్మ ఫౌండేషన్ అంబులెన్స్‌లో సున్నిపెంట ఆస్పత్రికి తరలించారు. వైద్యసిబ్బంది క్షతగాత్రులకు చికిత్స చేసి స్వల్పగాయాలైనట్లు పేర్కొన్నారు.

పాలమూరు కళాకారుల ఖిల్లా



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌లో జిల్లా కళాకారులకు కొదువలేదని చంద్రేశ్వర (అదృశ్య ఖడ్గం) సినిమా నిర్మాత రవీంద్రచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో సోమవారం సినిమా ప్రమోషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖ సినీ, రంగస్థల నటులు, సామాజికవేత్త సునామీ సుధాకర్‌తో కలిసి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నాగులపల్లి సొంతూరు అని.. ఈ చిత్రం శివబాలాజీ ఫిల్మ్ బ్యానర్‌పై నిర్మించినట్లు తెలిపారు. పాలమూరు బిడ్డగా నా సినిమాను ఇక్కడినుంచే ప్రమోషన్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని దర్శకులు జీవీ వర్ధన్ అద్భుతంగా తెరకెక్కించినట్లు తెలిపారు. ఈనెల 27వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రం పాలమూరు పౌరుషాన్ని నిలబెడుతుందన్నారు. అటు ఆధ్యాత్మిక, ఇటు హారర్ జోనర్‌లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా ఉంటుందన్నారు. జిల్లా కళాకారులు, నిర్మాతలు, దర్శకులకు పుట్టినిల్లుగా మారాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ ఈశ్వర్ దూలిపూడి, హీరోయిన్ దియా, ఆర్టిస్ట్ మహేశ్ పాల్గొన్నారు.

జూరాలకు 45వేల క్యూసెక్కులు


జూరాల ప్రాజెక్టు వద్ద 3 క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- మూడు క్రస్ట్ గేట్లు ఎత్తి 51,957 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో
- జల విద్యుత్ కేంద్రంలో 11యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ధరూరు, ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలతో కొన్ని రోజులుగా వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. ఆదివారం ప్రాజెక్టుకు 53వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం రాత్రి 7:30 గంటల వరకు ఇన్‌ఫ్లో 45వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు 3 క్రస్టు గేట్ల ద్వారా 12, 246 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో సోమవారం 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఎగువ జూరాలలో ఐదు యూనిట్ల ద్వారా 50.971 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు తెలిపారు. ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 107.266 ఎంయూ విద్యుదుత్పత్తి చేపట్టినట్లు వెల్లడించారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36, 340 క్యూసెక్కులు, కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 46 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 500 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 51,957 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండగా.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.710 టీఎంసీల నిల్వ ఉన్నట్లు తెలిపారు.

శ్రీశైలంకు 48,773 క్యూసెక్కులు

దోమలపెంట: జూరాలలో సోమవారం విద్యుదుత్పత్తి చేస్తూ.. 36,506 క్యూసెక్కులు, ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 12,267 మొత్తం 48,773 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి చేరుతున్నది. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 857.0 అడుగుల వద్ద 97.1760 టీఎంసీల నీటినిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో ఎంజీకేఎల్‌ఐకి నీటి విడుదల జరగలేదు.

నేలకూలిన వందేళ్ల చింతచెట్టు


నర్సింగాపురంలో ఈదురు గాలులకు కిందపడిన చింత చెట్టు

మదనాపురం: నిత్యం ఆ ప్రాంతంలో వృద్ధులు, చిన్నారులు తిరగాడేవారు.. వందేళ్లకుపైబడిన చింతచెట్టు వారందరికీ నీడనిచ్చేది. మండలంలోని నర్సింగాపురంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులకు వందేళ్లు నిండిన చింతచెట్టు నేలవాలింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పినట్టయిందని గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

అసలేం జరిగింది?!

- చాపల భాస్కర్ మృతిపై అనుమానాలెన్నో?
- పాలమూరు జైలు నుంచి వికారాబాద్‌కు ఎలా వెళ్లినట్లు?
- ఈ నెల 20న బెయిల్‌పై విడుదల.. 21న శవమయ్యాడు..


డిసెంబర్ 28న చాపలి భాస్కర్‌ను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించిన డీఎస్పీ లింగయ్య (ఫైల్)


పేట జనరల్ ఆస్పత్రిలో భాస్కర్ మృతదేహం

నారాయణపేట: సినీ ఫక్కీలో చోరీలకు పాల్పడుతూ మోస్ట్ వాంటెడ్ దొంగగా పోలీసు శాఖలో గుర్తింపు పొందిన చాపల భాస్కర్ (35) మృతి అనుమానాస్పదంగా మారింది. బెయిల్‌పై విడుదలైన వ్యక్తిని వికారాబాద్ పోలీసులు తీసుకెళ్లారని కుటుంబసభ్యులు చెబుతుంటే.. మాకేం సంబంధం లేదంటున్నారు. దీనికితోడు సొంతూరులో కాకుండా వేరేరాష్ట్రంలో అంత్యక్రియలు చేయడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. నారాయణపేట జిల్లా ఊట్కూర్‌కి చెందిన చాపల భాస్కర్ కొన్నేళ్లుగా దొంగతనాలను వృత్తిగా చేసుకున్నాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసేవాడు. పోలీసుశాఖలో చాపల భాస్కర్ మోస్ట్ వాంటెడ్‌గా గుర్తింపు పొందారు. ఆరు మాసాలుగా మహబూబ్‌నగర్ జైలులో ఉన్నాడు. కాగా.. ఈ నెల 20వ తేదీన బెయిల్‌పై విడుదలయ్యాడు. అయితే వికారాబాద్ జిల్లాలో 14 చోరీల్లో భాస్కర్‌పై కేసులు నమోదు కావడంతో భాస్కర్‌ను మహబూబ్‌నగర్ జైలు నుంచి బయటికి వచ్చినవెంటనే సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

● వికారాబాద్ పోలీస్‌స్టేషన్ నుంచి చాపలి భాస్కర్ భార్య తారమ్మకు శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఫోన్ చేసి.. మీరొచ్చి మీ భర్తను తీసుకెళ్లాలని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే తన భర్త వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎందుకున్నారంటూ పోలీసులను అడిగినట్లు సమాచారం. అయితే శనివారం ఉదయం 10 గంటల సమయంలో వికారాబాద్ నుంచి మఫ్టీలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు ఓ ప్రైవేట్ ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి గుర్మిట్కల్ దగ్గరలోని ఓ గ్రామస్టేజీ వద్ద చాపలి భాస్కర్‌ను వారి బంధువుకు అప్పజెప్పారు. అప్పటికే తీవ్ర అస్వస్థతకు గురైన భాస్కర్‌ను ఓ ప్రైవేట్ వాహనాన్ని మాట్లాడించి కానిస్టేబుళ్లు.. అందులో నారాయణపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలా చేస్తూ అక్కడి నుంచి నెమ్మదిగా జారుకున్నారు.

ఆస్పత్రికి వచ్చేసరికి మృతి..

స్పృహలో లేని భాస్కర్‌ను ఆస్పత్రికి తీసుకువచ్చే సరికి చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు భాస్కర్ వెంబడి వచ్చిన బంధువు చేరవేశారు. వెంటనే భార్య తారమ్మతో పాటు కుటుంబసభ్యులు వచ్చి ఆస్పత్రిలో శవమై కనిపించిన చాపలిభాస్కర్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. వెంటనే నారాయణపేట పీఎస్‌కు వెళ్లగా ఈ కేసు తమ పరిధిలో రాదంటూ సీఐ, ఎస్‌ఐలు చేతులెత్తేసినట్లు తెలిసింది. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ వాహనంలో శనివారం సాయంత్రం భాస్కర్ మృతదేహాన్ని వికారాబాద్ పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లి.. ఆరా తీశారు. మేము కస్టడీలోకి తీసుకున్నట్లు ఏమైనా ఆధారాలున్నాయా అంటూ బుకాయించినట్లు తెలుస్తోంది. దీంతో దీంతో చేసేదేమి లేక తిరిగి నారాయణపేటకు చేరుకున్నారు. చివరకు ఆదివారం నారాయణపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాముడు తెలిపారు. నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో చాపలి భాస్కర్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆయన స్వగ్రామం ఊట్కూర్ అయినప్పటికీ భాస్కర్ అత్తగారి ఊరు కర్ణాటకలోని సంకలాపూర్‌కు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు.